చిలుక పలుకులు

* * *

వచ్చీరాని రెక్కలు అల్లార్చడం అప్పుడప్పుడే అలవరచుకుంటూన్న, పసితనానే... తారాసుందరికి దక్కినాను. నాటినుంచీ నా జీవనం... పంజరబద్ధమే అయినా, ఖులాసాగా, స్వాదుఫలహార భోజనలతో... గడచిపోతూవచ్చినది.

అతిలోకమోహిని, తార: ఆమె వాలుగన్నులలోనుంచి, ఒక్కచూపు తళుకుమంటే చాలు... మా రౌతు సుమబాణపరంపర శరవేగాన్ని అతిక్రమించి, కురిసేది.

అనురూపుడైన వరుడు లభించాడు: ఆతని ఆకారవిశేషమే మమ్మల్ని అందరినీ మోసగించింది; అనుకూలుడు కాలేడేమోనని, ఏలా కలగనగలము?

ఈడేరిన తరువాత... యుక్తకాలానికి... తార కాపురానికి వెళ్ళింది; సారె సామానుతో... నేనూ, పంజరంతోసహా... ఆమె అత్తవారి యింటికి వెళ్ళాను.

—గదికి ఎదురుగా, సావడిలో... కుడిచేతివసారావైపున... నా పంజరభవనం వేలాడగట్టింది, తార: ప్రతిరోజూ, పొద్దు ఓ మాదిరి పోయినతరువాత... తాంబూలం పళ్ళెమూ, మగచెంబూ పట్టుకుని... వయ్యారంతో నడుస్తూవచ్చి నా దగ్గర ఆగేది. రాత్రిళ్ళు మామూలుగా, ఉప్పాడచీరె కట్టుకునేది ... ఉల్లిపొరలలాటివి. సొమ్ములన్నీ ముద్దుగా అమరించుకుని, నొక్కులు నొక్కులైన ఒత్తు తలకట్టుతో, తీయదనమే అలముకున్న, గుండ్రని ముఖంతో, సంతోషం

తొణికిపోయే చిరునవ్వుతో...హ - బ్బ !...ఎంత చూడ ముచ్చటగా ఉండేది ! ముద్దు పెట్టుకుని, నా అభిప్రాయాన్ని వ్యక్తీకరించు దామనుకున్నాను...ఎన్నిసారులో !

నా యోజన గ్రహించినట్టుగా... మా తార... నవ్వుతూ, కోమలాంగుళితో చంచువును పుణికి, నిష్క్రమించి... గదితలుపు గడియవేసుకునేది.

ఇద్దరూ...వారు ఇద్దరూనూ... ఎంతసేపో నవ్వుకునేవాళ్లు; గుసగుసలతో, ఎన్ని రహస్యాలో చెప్పుకునేవాళ్లు... ఎంతసేపో మేలుకునేవాళ్లు—

తొలిజామున, తలుపు ఓరెక్క నెమ్మదిగా తీసి వసివాళ్లాడుతూ నిదురకన్నులతో, ఆమె ఈవలికివచ్చి, నన్ను ఆ అరమోడ్పుతోనే పరామర్శించేది. నేను కునికిపాటు విదిలించుకుని... అక్కా అని... పలుకరించేదాన్ని.

—నీళ్లు పోసుకున్నది. నీరు ముమ్మరంగాపోసింది. తొలిచూలుచేత... ఓపలేని, ఓపలేనితనమేమో... భారకించి కదలలేక పోయేది. ఏలాగో, లేనిఓపిక చేసుకుని అయినా... నా దగ్గరకు రాకుండా మాత్రం మానేదికాదు.

కాని, మా ఆనంద సుమమంజరి సౌరభసంవాసితముకాలేదు. దేవకి సప్తమగర్భతుల్యమై పోయినది ఆమె వేకటి! చాలా జబ్బు కూడా చేసింది. ఓ రెక్క కోలుకునేటప్పటికే ఎంతకాలమో పట్టినది. వెనుకటి మిసమిస అంతా మాయమైంది. కొంచెము పాలిపోయి ఎప్పుడూ నీరసంగా ఉండేది. అయినా...ఆ కలువకన్నులు మామూలుమేరకు కటాక్షమాలికలను మెరపించడము మానలేదు.

—కటకటాల తలుపు దగ్గరగా మంచము వేయించుకునేది. జాజిపొదమీదుగా తేలుతూ వచ్చే పవనకిశోరాల హాయిఅంతా... ఆమెను జోకొట్టలేకపోయేది.— ఒకటే కలతనిదుర!...

అయనం మారిపోయింది. తారకు... ఓపిక చేరుకోక పోయినా... కోరికల తరితీపు ముమ్మరించినది. కాని—

ఆ వేళ...

—సగమురాత్రి గడచిపోయింది. అటూ ఇటూ మసలి, ఆమె, పక్కమీదను లేచికూర్చున్నది. తిరిగీ పడుకుని, అంతలో లేచి తిన్నగా నా పంజరంవద్దకు వచ్చింది. నేను... ఉత్సాహముతో కిలారించి, అనువైనంత దరికివచ్చాను.

—జాలిగా... దీనంగా... నావంక చూసింది. ఎంత వేదన భరిస్తూన్నదో...? కటకట బడగలనుకాని నా అనుతాపం ఏలా ఆమెకు తెలియజేయడం?

... పడకటింటికి తలుపు తెరుచుకున్నది: అతడు, లోనుంచి తొంగిచూశాడు. ఆవేశంతో, తార... చప్పున...

'వస్తూన్నాను' అన్నది కోవెలగొంతుతో.

'—పిలువలేదు—' అని, తలుపు ఓరన ఆ అరమోము నుంచి జవాబు. తార ఏమీ మాటాడలేదు.

'ఇంకా... మేలుకునే ఉన్నావేం?' అని లోపలనుంచి...

'నిదురరాలేదు'... అంటూ బయటనుంచి...

'తెచ్చుకుంటేనా...? నాకు తెలుసునులే నీ వేషాలు...'

—పాపం, ఏమనగలదు.. తార?

'... కనిపెడితే... భయపడుతాననుకున్నవా ఏం?'— తల... లోపలికి పోయింది. మరుక్షణంలో ఆతడు బయటికి వచ్చి... మాపక్కనుంచే... చురచుర చూస్తూ, వెళ్లిపోయినాడు.

తార, కదలక... ఆలాగే, ఉన్నచోటనే నిలువబడిపోయింది. మొగమెత్తి, కన్నీళ్లజాలుతో, ఎలా... ఎలాగో... చూసింది. ఇక, ఆపలేక... వెక్కి వెక్కి ఏడ్చింది, ఎంతసేపో—

'అక్కా... అక్కా — అ...క్కా...'

— సంభాళించుకున్నది: మన్యువేగభరమైన గొంతులో— 'ఇది తగదని... ఇలా చేయడం కూడదని... నీవైనా చెప్పవు కద!' అన్నది.

నిజమే!... చిలుక రాయబారాలు... ప్రణయకలహముల చాయల్లో... విప్రలంభాలకు, ప్రబంధకాలములో, కొంతవరకూ ఉపకరించినవి. ఇప్పుడు, మా కులమునకు, ఆతాహతు ఏదీ? నేరిపే గురువులేరీ? అయినా, ఇదివరలో మందారమకరంద మాధుర్యముల దేలిన మధుపము... మదనములకు, చేరడం మరగిన తరువాత మళ్లా బాగుపడుతుందని... నాపిచ్చితల్లికి ఏలా చెప్పగలను... ఏమని ఊరడించగలను?

— తలుపు తొలగి పోయింది— తార, పంజరమును, పరాకుగా తడమటంలో. నేను, వెనుక ముందు ఆలోచించకుండా, బయట పడ్డాను. ఆమె నన్ను గమనించనే లేదు. పట్టుకు నేందుకు ప్రయత్నించ లేదు. ఆ స్వేచ్ఛావకాశమును పురస్కరించుకుని... కిటికీదాకా చెంగుతూపోయి... కమ్మీల సందునుంచి, చూసుకున్నాను.

పండువెన్నెల!— క్షుద్రవిహంగాలు తప్ప ఉత్తమజాతు లేవీ... సంచరించకూడదనే అనుస్మృతమైన నియమాన్ని అప్పుడు లక్ష్యం చేస్తానా? రెక్కలున్నా... రెక్కలు కట్టుకుని పోతూన్నట్టుగా సాగుతూన్న నాకు... ఆతడు, ఎంత దూరమైతేనేమి... కలుసుకున్నాను.

— అప్పటికి అప్పుడే విలాసభవనం మెట్లు నదురూ బెదురూ లేకుండా... వెనుక తిరిగిఅయినా చూడకుండా... ఎక్కుతున్నాడు. నేను, రోడ్డుకు ఈవలివైపున... ఎదురుగా, దీపస్తంభము అడ్డకమ్మీమీద వాలాను. తలుపు తట్టినాడు. చాలా నెమ్మదిగా నాకు వినిపించ లేదు కాని... ఏదో పేరున పిలిచాడు, రెండుమూడు

సార్లు. తలుపు... తనంతటగా... తెరుచుకున్నది; లోపలికి అడుగు వేశాడు,... గడియ పడ్డది.

అలాగే... అక్కడే ఆలోచిస్తూ కూర్చున్నాను, ఇంటివైపు చూస్తూ. లోపలకు ఏలాగ చేరుకోవడం? చుట్టు తిరిగితే ఎక్కడన్నా దోవ కనబడుతుందేమో?

... ఎటూ పాలుబోక ఉండగా— నాకు ఎదుర... మేడ మీద గదిలో వెన్నెల పడినట్లు దీపం వెలిగింది. రెండు కిటికీలకూ పై వరుస రెక్కలు తీసే ఉన్నవి.

—సద్దు చేయకుండా... ఊరికే అలా, అ... లా... రెక్కలు అనుకుంటూ తేలిపోయి, ఎడమ కిటికీపై నున్న ఆచ్ఛాదనను ఆధారము చేసుకుని... లోపలగా సందు చిక్కించుకుని... కూర్చున్నాను... చూస్తూ.

తలవైపు, దోమతెర జారవిడిచి ఉన్నది... పందిరిమంచమునకు: ఆతడు, ఎదటివైపున నిలుచుని, పడుకుని ఉన్న ఆ... ఆ-మెను మీగాళ్లు కదిలిస్తూ... 'రాజా— రా... జా' అని పలుకరిస్తూ, మేల్కొలుపుతున్నాడు.

ఒక మారు, కలవరింతగా మూలిగి... పక్కకు ఒత్తిగిలి... మళ్ళీ నిద్రనే అభినయించింది. ఓ నిమిషము చూసి, బలవంతాన లేవదీసి కూర్చోబెట్టాడు. నిద్ర మత్తులో లాగ... తూలిపడబోతే, కౌగిట నలముకుని, సోఫామీదకు పోయి పడ్డాడు. 'ఏమిటి... ఈనిద్ర?...' అని, తన భుజంమీదకు వాలిన ఆమె ముఖం వంక చూస్తూ, మునివేలితో పెదవిని మీటుతూ...లాలనగా అడిగాడు.

అప్పుడే మేల్కొంచినట్టుగా... కళ్ళు, అర విరియించి, ఒక మారు ఆతనివంక... ఆ చూపుతోనే గది అంతా కలయవేసి...

పై పెదవికి అంగుళులు చాటుచేసి నాజూకుగా ఆవలించి... ఆతని ఒడిలో తనతల అమరేటట్టుగా జరిగి... ఒరిగింది.

పడుచు ... చాల అందంగా ఉన్నది! అవును... నాగు పాము...చక్కగా ఉండదూ...? ఆడుపులి... ?

—ఆమె చెక్కిలి నిమురుతూ రెండవ చేతితో... పాణిని అందుకుని తన మెడమీదుగా లాక్కో బోయినాడు... కొంచెం ముందుకు వంగి. ఆమె, ఆ విలాసాన్ని చెరిపివేసి, చికాకుతో... కోపంగా... 'ఉహూం... మోటతనం'... అని విదలించింది.

మా ప్రబుద్ధుడు, తన పాండిత్యమంతా వినియోగించి ఆమెను కిలకిలలాడించాలని చూశాడు. కాని.. ఆ హుషారీ - సరసాలు... సాంత్వనోపాయములు ... వ్యర్థమౌతూన్నవి; అంత చులకనగా కన్నులు తెరచి కటాక్షించడము...రసభంగముకాదూ... ?

—లేచి...అటూ ఇటూ పచారుచేశాడు! ఆకుమడుపులు... ఆ పరధ్యానంలోనే అందుకుని...గోరుతో తుంచి...మీదకు విసిరాడు. ఫోను మొదలువేసి, చప్పున ఆపి...చలాకీగా పన్నీరుబుడ్డి అందుకుని, ఒక్క అంగలో సోఫాదగ్గరకు వెళ్ళి...ఆమె నులిపైట చెరగు ఒంటికి అంటుకుపోయే అంత ఒత్తుగా చిలకరించాడు. ఏమీ పనిచేయలేదు...పన్నీటిజల్లు: ఆమె ఇంకా మేలుకోదలచినట్లులేదు.

ఉత్తరీయం అందుకుని, ముందుకు నాలుగు అడుగులు వేసి... ఒక నిమిషం ప్రతిమలాగు నిలువబడి... 'నేను... వెళుతున్నాను' అని, కొంచెం ధూకుడుగా తలుపుదాకాపోయి...గడియచప్పుడు చేస్తూ, మళ్లా నిలువబడినాడు. తిరిగీ...సమీపించి...జఘనోపరిని మృదువుగా ... కరపరామర్శనము చేస్తూ 'నేను ... వెళ్ళిపోనా...' అని జాలిగా అడిగాడు: ఆమె... అరమెలకువలాగా... మసలి... ఊరుకున్నది. బలవంతాన, చోటుచేసుకుని, ఆమె దగ్గర... సోఫాలో... ఇరికాడు. చెక్కిలి నిమురుతూ... 'ఎందు

కూ— అంత కోపం?' అన్నాడు. అవశనుగా తలుస్తూ... లోగొన బోయినాడు. ఆమె... కస్సుమని లేచి ఆతన్ని, మోటుగా తోసి... ఎదురై ఒరగిలి కూర్చుని... 'ఏమిటి... ఆగడం!' అని గర్జించింది.

'హా... మ్మ! మేలుకున్నా వన్నమాటేనా...' అని ఈబలాటంతో దగ్గరకు జరిగి... మీద చేయివేయ బోయినాడు. 'చాల్లెండి... ఇక చాలించండి... మీసరసాలు...' అని కసిరింది. ఆతడు... వినిపించుకోనట్లు, ప్రణయోత్సాహమును తగ్గించుకోలేదు.

'దూరంగా కూర్చోండి.'

'ఎందు కేం?'

'నన్ను ముట్టుకోవద్దు.'

'ఆఁ... నీ యిష్టమే...'

'కాదు!... అన్నిటికీ... మీయిష్టమే...! ఇక్కడ దాచబెట్టారు—! అర్ధరాత్రి... అంకమ్మ శివాలు—! మళ్లీ బెదిరింపులు కూడాను: వెళితే వెళ్లండి. కడుపు నిండుతూంది... మిమ్మల్ని చూస్తూకూర్చుంటే!... చిక్కకుండా ఓ చుక్క గంజీ... మొగం వాయకుండా మొగుడూ... అని మా అవ్వ అనేది...'

'సరే... వెళుతాను' అని లేవబోయినాడు.

'వల్లకాదు... మీ యిష్టమేనా...' అంటూ చేతులు ఆతని మెడకు పెనవేసి, ఒక్క నిమిషం హాయి అనిపించింది. అంతలో వదలి... దూరంగా జరిగి, అర్ధరౌద్రాకృతిలో...

'...అన్నీ అబద్ధాలే'

'ఏమీ?'

'మరి...ఏవీ...'

'ఓ... ఇందుకా... అలుక...? తయారైన మరు నిమిషంలో... తీసుకురాకుండా ఉంటానా...'

'అవును... ఎన్నాళ్లకు అయినా తయారు కావు...! నే బ్రతికి ఉండగా... కావు! కమసాలివాళ్లందరూ గంగలో కలిసిపోయినారా...? నాకు...చేయించడానికి వచ్చేటప్పటికి మీ చేతులు...'

'నామాట... నమ్మవూ! నిజంగానే...'

'నాతో... మాటాడమాకండి...'

కులనాయకుడు...కాళ్లంటి బ్రతిమాలినాడు, అనుగ్రహించమని. సత్యభామ తాపునకు శతగుణమైన పాదప్రహారాన్ని... మహాప్రసాదముగా పరిగ్రహించాడు. కాని...

—ఆవేశంతో...వెర్రివానిలాగానిలుచుని...పరవళ్లుపోయి...

'...చూచుకో—రాజా! నీవు మోయలేనన్ని సొమ్ములు... ఇప్పుడే తెస్తాను...' ఇలా శపథముగా కలువరించాడు.

ఆ...మె,మందహాసముతో...ఒట్టు...అని వేలు వయారించింది.

సంజీవి పర్వతంకోసం బయలుదేరిన పవమానసూనుని లాగా... మా నాయకుడు... ఒకే గంతు, పరుగు. నేను, ఇక అక్కడ నిలువకుండా... ఎగిరి, పూర్వమార్గాన్నే... ఆతనికన్న ముందుగా యింట్లోకి వచ్చేశాను. అంతా నిశ్శబ్దముగా ఉన్నది. తార... నిద్రలో ఏమో... కదలకుండా పడుకున్నది:

తోచక, పంజరం కోపుమీదవాలి కూర్చున్నాను; తారను చూచినకొద్దీ శోకం అతివేల మౌతూన్నది. కాని కడుపులో వేదనను కన్నీటిధారలలో చల్లార్చుకోవడానికి...మేమునోచుకొనలేదుకదూ!...

— అంతలో...

తలుపు ధడాలున తెరుచుకుని... ఆతడు లోపలికి వచ్చాడు. నాకు, పంచప్రాణాలూ లేచిపోయినవి. వికృతమైపోయిన వదనము చూడగానే. కూర్చున్నచోటనే... ఒదిగి పోయినాను.

... యకాయకిని గదిలోకి వెళ్ళిపోయినాడు. అవీ-ఇవీ విరజిమ్ముతూన్న చప్పుడు గలభాగా అయినది. బయటకు ఉరికి... మంచం దగ్గరకు వెళ్ళి, తారను... నొచ్చుకునేటట్టుగా... కద లించి...

‘ తాళాలు... ఏవీ? ’ అని... అదరిపాటుగా...అడిగినాడు.

‘ ఏమో... ’ అన్నది నిదురమబ్బులో, తార...

దిండుతోకూడా...తల పక్కకు దొర్లించి తాళాలు తీసుకుని మళ్ళాలోపలకు వెళ్ళిపోయినాడు.

—ఇనుప మందసము చప్పుడు ! ...తార లేచి కూర్చున్నది. నేను...సద్దుచేయకుండా వెళ్ళి సమీపాన కిటికీలో వాలాను. నా తల నిమురుతూ...ఎంతో జాలిగా...అధీరముగా ..కడుపు తరు క్కునిపోయేలాగు...చూసింది ; ఆ చిన్నారి కనుదామరలు సద్యస్త రంగితనయాగరాలయినవి.

ఆతడు పునః...వచ్చేశాడు. చేతిలో ఆభరణపేటిక ఉన్నది. తారనుచూసి, ఉలికిపడి అడుగు ముందుకువేయకుండా ఆగిపోయి...

‘ మెలకువ...వచ్చిందేం ’ అని సామర్షంగా, వెకిలిగా... నీచపుచూపుతో అన్నాడు.

తార...ఏమీ అనకుండా...అడుగడుగుకూ వేపథువౌతూ సమీపించి తలవంచుకుని నిలుచున్నది.

‘ వెళుతున్నాను... ’

ఆమె...మీద చెయివేయబోయింది. ఏమో అనబోయింది. అంతే...

ఆఁ...ఆఁ...ఏమనను ! ...ఆ...ఉద్దండుడు చేతిలోని భర ణితో ...హా...బ్బ... !

—అంతే, తార... ఆతనిపాదముల దగ్గరే... పతిచరణ మూలముననే... మొదలంట కూలిపోయింది.

నేను... గగ్గోలు అయిపోయి..., అలికిడి చేయడం... నాస్థితి .. ఆ ధర్మాత్ముని కంటపడి... తాళపు చేతులు నామీదకు విసిరాడు. కాలూ, రెక్కా విరిగి... జటాయువునై పోయినాను కసిదీరా ముద్దగా నలిపేసి... మెడనులుమకుండా... గిరవాటు వేసి... తిరిగిచూడకుండా వెళ్లిపోయినాడు.

మెదలలేక... పడినచోటనేఉండి... తారవంక చూస్తూన్నాను. కదలిక లేదు. ఎంతసేపో... మరి... ఎంతసేపో .. లేస్తుందేమోనని చూశాను. ఊహు...

ఒక్రమానికి... మనసు నిలుపలేక... బలవంతాన ఒక రెక్కమీద దేకి... సమీపించి, ఆమెభుజం మీదకు ప్రాకి, రెక్కతో మెల్లన విసిరాను. చంచువుతో చెక్కిలి గీరాను. కాని...

—తార... ఇక లేదు. మా కన్నతల్లి... ఈలోకములో... ఇక నన్ను పలుకరించదు. పతిప్రాణఅయిన కులవధువుకు... నాథుడు మన్నించనినాడు... జీవము నిలుపుకొనే అవసరము... పని .. ఏమున్నదీ ?—

—ప్రాణములమీద తీపి...తీయని పండ్లను ఆరగించి అలవరచుకున్నది... గృహ మార్జాలికి అందక తప్పించుకుని... బ్రతుకుతూ వచ్చినది, ఇంతవరకూ.. మా చిట్టితల్లి... తారకోసమే కాదూ...

ఇక... నాకు విముక్తి ఎన్నటికో. 'మ్యావ్' ప్రత్యభిజ్ఞతో నా మోక్షకారకులు ఏనిమిషాన దర్శనమిచ్చి, నన్ను మాతార దగ్గరకు చేర్చుతారో...! ఆ ధ్యానమే, ఇక ! ఆతడు... ఊః... ఆ పాపకర్ముని జోలి... ఎవరికి కావాలి ?

* * *